క్లుప్తంగా

మహిళా సెషన్స్‌ కోర్టు ఏపీపీగా మద్ది జ్ఞానాంబ



విజయవాడలీగల్‌: విజయవాడ మహిళా సెషన్స్‌ కోర్టు అడిషనల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది మద్ది జ్ఞానాంబను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీచేసింది. ఏపీపీగా మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. 1997లో బెజవాడ బార్‌ అసోసియేషన్‌లో ఆమె సభ్యత్వం తీసుకుని, గత 28 సంవత్సరాలుగా న్యాయవాదిగా ఆమె కక్షిదారులకు సేవలందించారు.

వైభవంగా గరుడ పంచమి



వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం గరుడ పంచమిని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేంచేసి ఉన్న గరుడాళ్వార్‌కు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను జరిపించారు. తొలుత విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకారం చేసి విశేష అర్చనలను నిర్వహించారు. గరుడ పంచమిని పురస్కరించుకొని సంతానార్థులకు ప్రసాదాలను అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

క్రీడల్లో సిద్ధార్థ వైద్య విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్‌ ఎన్టీఆర్‌ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24 వరకూ రాజమండ్రి జీఎస్‌ఎల్‌ వైద్య కళాశాలలో జరిగిన అంతర్‌ వైద్య కళాశాల క్రీడా పోటీల్లో ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థులు సత్తా చాటారని ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఆలపాటి ఏడుకొండలరావు తెలిపారు. తమ విద్యార్థులు బాల్‌ బ్యాడ్మింటన్‌, చెస్‌ రన్నర్స్‌ ట్రోఫీ, వాలీబాల్‌, లాన్‌ టెన్నిస్‌లో తృతీయ బహుమతులు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా క్రీడల్లో ప్రతిభ చూపిన టీమ్‌ కెప్టెన్‌లు జి.మనస్వి, డి.వర్ష, ఎం.సాయిదివ్య, జి.నీలోత్స్నతో పాటు, ఇతర క్రీడాకారులను మంగళవారం డాక్టర్‌ ఏడుకొండలరావు, వైస్‌ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.ప్రశాంతి, డాక్టర్‌ ఎం.విజయశ్రీ, ఫిజికల్‌ డైరెక్టర్‌ రాము జరుబుల అభినందించారు.

మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్లు బలోపేతం



గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్లను బలో పేతం చేయాలని విముక్తి అధ్యక్షురాలు అపూర్వ డిమాండ్‌ చేశారు. ట్రాఫికర్స్‌కు శిక్షలు పడేలా చేయడంతో పాటు బాధిత మహిళలకు నష్టపరిహారం, పునరావాస సేవలు కూడా మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్ల ద్వారా అందించాలన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విముక్తి, హెల్ప్‌, ఆర్‌ హెడ్స్‌, గైడ్‌ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అపూర్వ మాట్లాడుతూ.. ట్రాఫికింగ్‌ ఏ ఒక్కరి ద్వారానో జరిగే నేరం కాదని, ఇది శక్తివంతమైన క్రిమినల్‌ నెట్‌వర్క్స్‌ ద్వారా లాభాపేక్షతో నడిచే వ్యవస్థ అని అన్నారు. ఆన్‌లైన్‌ ప్లాట్‌ఫామ్స్‌, సోషల్‌ మీడియా, నకిలీ ఉద్యోగ ప్రకటనల ద్వారా పేదరికం అంచున ఉన్న వర్గాలను లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. విముక్తి రాష్ట్ర శాఖ కోశాధికారి లక్ష్మి మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాను నడిపించే అన్ని రకాల అక్రమ వ్యాపారాలను ధ్వంసం చేయాలన్నారు. విముక్తి రాష్ట్ర నాయకురాలు శాంతి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కేవలం 13 జిల్లాల్లో మాత్రమే అధికారికంగా మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్లు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫికింగ్‌ కేసుల కోసం కేంద్రీకృత ఆన్లైన్‌ ట్రాకింగ్‌ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో హెల్ప్‌ సంస్థ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్‌, ప్రాజెక్ట్‌ మేనేజర్‌ వి.భాస్కర్‌, ఆర్‌ హెడ్స్‌ సంస్థ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ వి.రామకృష్ణ, గైడ్‌ సంస్థ ప్రాజెక్ట్‌ మేనేజర్‌ సుజాత పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన బాండ్ల సంగతేంటి?

- ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన వాగ్దానాలపై ప్రశ్నించాలి
- 52వ డివిజన్‌ వైఎస్సార్‌ సీపీ విస్తృత సమావేశంలో వెలంపల్లి



క్యూఆర్‌ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు

వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల బాండ్లపై సమాధానం చెప్పాలని వైఎస్సార్‌ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్‌ చేశారు. వైఎస్సార్‌ సీపీ 52వ డివిజన్‌ విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో వెలంపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్‌ ఇన్‌చార్జ్‌ బంక చాము, స్థానిక డివిజన్‌ ఇన్‌చార్జ్‌ తంగెళ్ల రామచంద్రరావు, ట్రేడ్‌ యూనియన్‌ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి, డివిజన్‌ పార్టీ నాయకులు పాల్గొన్నారు. బాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని టీవీలో చూపించారు. ఇంటింటికీ క్యూఆర్‌ కోడ్‌తో వెళ్లి ప్రజలతో ఆ కోడ్‌ను స్కాన్‌ చేపించి కూటమి మోసాలను వివరించాలని కోరారు.

అప్పులు చేసినా అందని పథకాలు

ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రజల్లో మంచి స్పందన లభిస్తోందన్నారు. చంద్రబాబు మాటలను ప్రజలు ఎవరూ నమ్మరని తెలిసి పవన్‌ కల్యాణ్‌, బాబు తమ ప్రతినిధులను ఇంటింటికీ పంపించి జగన్‌ ద్వారా ప్రతి ఇంటికి సంవత్సరానికి లక్ష రూపాయలు వస్తే తాము అధికారంలోకి వస్తే రూ.2 లక్షల లబ్ధి చేకూరుస్తామని చెప్పారని గుర్తుచేశారు. ప్రజలను మోసం చేసేవిధంగా ఎంతమంది ఉంటే అంత మందికి తల్లికి వందనం వస్తుందని, 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని, ఇంటికి ఇద్దరు ఉంటే ఏడాదికి రూ.36 వేలు వస్తుందని, చదువు పూర్తయి ఉద్యోగం లేని నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు ఇస్తామని చెప్పారని వివరించారు. ఐదు సంవత్సరాలకు కలిపి రూ.10 లక్షలు లబ్ధి చేకూరుతుందని పేర్కొంటూ పత్రాలు, బాండ్లను పంచి ప్రజలను మోసం చేశారన్నారు. ఆ పత్రాలను చూసి చంద్రబాబు మారాడేమో అని ప్రజలు నమ్మి ఓట్లేశారన్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఒత్తిడి మేరకు తల్లికి వందనం పథకం అరకొరగా అమలు చేశారని పేర్కొన్నారు. అయితే దాదాపు 30 లక్షల మందికి ఎగొట్టారని విమర్శించారు. 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు ఇస్తానని చెప్పి, ఇప్పుడు దాదాపు ఐదు లక్షల మందిని తొలగించారని వివరించారు. ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే ఆంధ్ర రాష్ట్రాన్ని అమ్మేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తుంటే చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌ శ్రీలంక అవుతుందన్నారని గుర్తు చేశారు. వైఎస్సార్‌ సీపీ పాలనలో రూ.3లక్షల కోట్లు అప్పు చేసి, సంక్షేమ పథకాలన్నీ అమలు చేశారని వివరించారు. కూటమి వచ్చిన సంవత్సరంలోనే రూ.1.75 లక్షల కోట్ల అప్పులు చేశారని, అయితే సంక్షేమ పథకాల అమలును మాత్రం విస్మరించారని దుయ్యబట్టారు. ప్రజల వద్దకు వెళ్లి ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన బాండ్లలో ఉన్న పథకాలు వచ్చాయా లేదా అని ప్రజలను అడిగి గుర్తుచేయాలన్నారు.



పార్టీ నేతలతో కలసి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్‌తో వెలంపల్లి తదితరులు



క్యూఆర్‌ కోడ్‌లను ప్రదర్శిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు

ఇచ్చిన మాట తప్పని జగన్‌మోహన్‌రెడ్డి

విందిపేట(విజయవాడపశ్చిమ): కరోనా వంటి క్లిష్ట పరిస్థితిలో కూడా సంక్షేమ పథకాలను అమలుచేసిన గొప్ప దార్శనికుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. స్థానిక 55వ డివిజన్‌, రామలయం ఫంక్షన్‌ హాలులో మంగళవారం కార్పొరేటర్‌ శిరంశెట్టి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. వెలంపల్లి మాట్లాడుతూ.. ఇచ్చిన మాట తప్పకుండా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా అమలు చేసిన ఘనత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం సాధ్యం కాదని చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. ఉచిత బస్సు పథకంతో తిరుపతి, అన్నవరం, అరసవల్లి వెళ్లొచ్చని చెప్పి ఇప్పుడు జిల్లాకు మాత్రమే పరిమితం చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అమలు కాని హామీలతో మోసం

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): ఎన్నికల్లో అమలుకాని హామీలతో ఊదరకొట్టిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను నిలువునా మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం స్థానిక 34వ డివిజన్‌, కేదారేశ్వరపేటలో ఏపీ ఐడీసీ మాజీ చైర్మన్‌, స్థానిక డివిజన్‌ కార్పొరేటర్‌ బండి పుణ్యశీల ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వెలంపల్లి మాట్లాడుతూ.. కరోనా వంటి క్లిష్ట పరిస్థితిలో సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా అమలు చేసి పేద ప్రజలను కాపాడిన గొప్ప దార్శనికుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు మాత్రం ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం సాధ్యం కాదని అనడం సిగ్గు చేటు అన్నారు. కూటమి నేతలు తమ వద్దకు వచ్చినప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీలపై ప్రశ్నించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.

14 ఏళ్ల బాలుడిపై దాడి

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): బాత్‌ రూం వద్ద ఫొటోలు తీస్తున్నాడన్న నెపంతో 14 ఏళ్ల బాలుడిపై నలుగురు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. భవానీపురం కోళ్ల ఫారం రోడ్డుకు చెందిన ఓ వ్యక్తికి 14 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఆ బాలుడు ఆదివారం ఇంటి పక్కన వీధిలో ఫోన్‌ చూస్తూ తిరుగుతుండగా నలుగురు వచ్చి ముఖంపై దాడి చేసి గాయపరిచారు. తమ కుమారుడిని ఎందుకు కొట్టారని ఆ నలుగురినీ బాలుడి తండ్రి నిలదీశాడు. అతను తమ బాత్‌ రూం ఫొటోలు తీస్తున్నాడని చెప్పారు. ఇంటి పక్కన గోడ వద్దకు వెళితే వైఫై సిగ్నల్‌ వస్తుందని, అక్కడ ఫోన్‌ చూస్తున్నాడే తప్ప ఎవరి ఫొటోలు తీయ లేదని బాలుడి తండ్రి చెప్పారు. దీంతో అతనిపై ఆ నలుగురితోపాటు మరికొందరు వచ్చి గొడవ పడ్డారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): పుట్టింటికి వెళ్తానంటే భర్త వద్దన్నాడని భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన గొల్లపూడి జైన్‌ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గొల్లపూడి జైన్‌ కాలనీకి చెందిన దర్పన్‌ ఆర్‌ జైన్‌ ప్లాస్టిక్‌ వ్యాపారం చేస్తుంటాడు. అతనికి 17 ఏళ్ల క్రితం సిద్ధి జైన్‌తో వివాహమైంది. సిద్ధి జైన్‌ సోమవారం తన పుట్టింటికి వెళ్తానని భర్తతో చెప్పింది. అతను నిరాకరించాడు. అదే సమయంలో ఆమె అన్న ఫోన్‌ చేసి పుట్టింటికి రావొద్దని చెప్పాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం దర్పన్‌ భర్త షాపునకు వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటలకు భార్యకు ఫోన్‌ చేసి వీడియో కాల్‌ మాట్లాడాడు. రాత్రి 9 గంటల సమయంలో షాపు నుంచి వచ్చి చూడగా సిద్ధి జైన్‌ ఇంట్లో లేదు. చుట్టుపక్కల తెలిసిన వారిని అడిగినా ఆచూకీ లేదు. దీంతో తన భార్య కనిపించడం లేదని భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్యకు చైన్నైకు చెందిన రాజు జైన్‌తో వివాహేతర సంబంధం ఉందని, అతనితో వెళ్లి పోయి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రామరాజ్యనగర్‌ ప్లాట్ల యజమానులకు ఊరట



న్యాయ పోరాటం చేస్తున్న ప్లాట్ల యజమానులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక రామరాజ్యనగర్‌ కరెంట్‌ ఆఫీస్‌ సమీపంలో నెల రోజుల నుంచి శాంతియుత పోరాటం చేస్తున్న 42 ప్లాట్ల యజమానులకు ఊరట లభించింది. రెండు దశాబ్దాల క్రితం రామరాజ్యనగర్‌ పరిధిలోని జోజినగర్‌ ప్రాంతంలో పేద, మధ్య తరగతికి చెందిన 42 మంది అబ్దుల్‌ మజీద్‌ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్‌ చేయించుకున్నారు. అనంతరం వారు నగరపాలక సంస్థ ద్వారా అన్ని అనుమతులు పొంది బ్యాంకుల్లో రుణాలు తీసుకుని ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంత మంది ఆయా ప్లాట్లకు తప్పుడు పత్రాలు సృష్టించి వాటిని కబ్జా చేసేందుకు కుట్రపూరిత చర్యలకు పాల్పడ్డారు. అందులో భాగంగా వారందరినీ ఖాళీ చేయాలని కోర్టు ద్వారా నోటీసులు ఇప్పించటంతో పాటు దౌర్జన్యానికి దిగారు. దీంతో ఉలిక్కిపడ్డ వారందరూ తమకు న్యాయం కోరుతూ నెల రోజులుగా దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని పోరాటం చేస్తున్నారు. బాధితుల న్యాయపోరాటానికి స్పందించిన న్యాయవాది శివశంకర్‌ వారి వద్ద పూర్తి వివరాలను తీసుకుని సుప్రీం కోర్టును ఆశ్రయించి 42 ప్లాట్లు ఖాళీ చేయకుండా స్పెషల్‌ లీవ్‌ పిటీషన్‌ (ఎస్‌ఎల్‌పీ)కు నంబర్‌ తీసుకొచ్చారు. దీంతో ఆయా ప్లాట్ల యజమానులు హర్షం వ్యక్తం చేశారు. ఇళ్లు ఖాళీ చేసే పని లేకుండా ప్రస్తుతానికి సుప్రీం కోర్టు నుంచి ఎస్‌ఎల్‌పీ నంబర్‌ రావడంతో తమకు కొంత ఊరట లభించిందని, త్వరలో స్టే ఆర్డర్‌ కూడా వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

వాహనాలకు ప్రభుత్వ అధీనంలోనే ఫిట్‌నెస్‌ చేయాలి

- ఓలా, ఊబర్‌, ర్యాపిడో కమీషన్లు పెంచాలి
- ఆలిండియా రోడ్‌ ట్రాన్స్‌ పోర్ట్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): ఆటో, మోటార్‌ వాహనాలకు బ్రేక్‌ చేసే పద్ధతి మాన్యువల్‌గా ప్రభుత్వ అధీనంలోనే చేయాలని ఆలిండియా రోడ్‌ ట్రాన్స్‌పోర్ట్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ డిమాండ్‌ చేసింది. ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చౌక్‌లో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆల్‌ ఇండియా రోడ్‌ ట్రాన్స్‌ పోర్ట్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు, జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, ముఠా వర్కర్స్‌ యూనియన్‌ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాములు ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ఆటో, మోటార్‌ కార్మికుల జీవనోపాధిని కాపాడే విధంగా ప్రభుత్వమే యాప్‌లు నిర్వహించాలన్నారు. ఓలా, ఊబర్‌, ర్యాపిడో కమీషన్లు పెంచాలని డిమాండ్‌ చేశారు. వేలాది రూపాయల జరిమానాలను నిలిపివేయాలన్నారు. అనంతరం అదనపు రవాణా కమిషనర్‌ ఎల్‌.ఎస్‌.ఎం రమాశ్రీకి వినతిపత్రం అందించారు. ధర్నాలో సీఐటీయూ పశ్చిమ సిటీ ప్రధాన కార్యదర్శి ఇ.వి నారాయణ, మోటార్‌ వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు ఎం.బ్రహ్మయ్య, విజయవాడ సిటీ ఆటో వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు బి.రూబెన్‌ కుమార్‌, ఎం.హనుమంతరావు, ఎస్‌కే దుర్గావలి, డి.కోటయ్య, మధుబాబు ముఠా వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు వెంకట్రావు, సీహెచ్‌ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలతో అనర్థాలు



కాలనీలో పర్యటించి విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ): గంజాయి, మత్తు పదార్థాలు వినియోగం వల్ల అనేక అనర్థాలు ఎదురవుతాయని మహిళా పోలీస్‌ స్టేషన్‌ ఏసీపీ టి.డి.ప్రసాద్‌ హెచ్చరించారు. యువత మత్తుకు బానిస కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని జక్కంపూడి కాలనీలో మహిళా పోలీస్‌స్టేషన్‌ సిబ్బంది మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు సూచనలు ఇచ్చారు. సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించిన పోలీసులు, మహిళలకు, యువతులకు శక్తి యాప్‌ వినియోగంతో ఉన్న ప్రయోజనాలను వివరించారు. మత్తు పదార్థాలను వినియోగించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించేందుకు, ప్రజలకు భరోసా కల్పించేందుకు సీపీ ఎస్‌.వి.రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు కాలనీలో పర్యటించామని పేర్కొన్నారు. అనంతరం కాలనీలోని పలు శివారు ప్రాంతాల్లో పర్యటించి నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల్లో మద్యం తాగుతున్నవారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్‌ ఇచ్చారు. కాలనీలో పర్యటించిన వారిలో కొత్తపేట సీఐ కొండలరావు, మహిళా పీఎస్‌ సీఐ వాసవి, ఈగల్‌ టీం సిబ్బంది ఉన్నారు.

గిరిజనులకు పట్టాలు ఇవ్వాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): గిరిజనులు సాగుచేస్తున్న భూముల సమస్యలు పరిష్కరించి వారికి పట్టాలు మంజూరు చేయాలని పలువురు వక్తలు డిమాండ్‌ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్‌, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు, ఫారెస్టు అధికారులు గిరిజనేతరులకు తొత్తులుగా మారారని విమర్శించారు. జీలుగమిల్లి, బుట్టాయిగూడెం, పోలవరం మండలాల్లో ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన గిరిజనులకు 2013 భూసేకరణ చట్టం కింద నష్ట పరిహారం చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయకార్మిక సంఘం నాయకుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. షెడ్యూల్డ్‌ ఏరియాల్లో గిరిజనులను గిరిజనేతరులు దోచుకుంటున్నారన్నారు. కౌలు రైతు రాష్ట్ర సంఘం కార్యదర్శి ఎం.హరిబాబు, రైతుసంఘం రాష్ట్ర సీనియర్‌ నాయకుడు కేశవరావు, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కె.ధనలక్ష్మి, కేవీపీఎస్‌ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఏఐకేఎఫ్‌ నాయకుడు వెంకటరెడ్డి మాట్లాడారు.

విశ్రాంత జీవితం ఆదర్శప్రాయం కావాలి

సెంట్రల్‌ జీఎస్టీ కమిషనర్‌ సుజిత్‌ మల్లిక్‌

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): ఉద్యోగ విరమణ కాలం విశ్రాంతికే కాకుండా, పది మందికి మేలు చేసే సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సెంట్రల్‌ జీఎస్టీ కమిషనర్‌ సుజిత్‌ మల్లిక్‌ సూచించారు. ఎం.జి.రోడ్డులోని జీఎస్టీ భవన్‌ లో మంగళవారం జరిగిన సూపరింటెండెంట్‌ ఎం.గిరిబాబు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ విధి నిర్వహణలో గిరిబాబు అందించిన సేవలు ఉద్యోగులందరికీ మార్గదర్శనమని అన్నారు. గిరిబాబు మాట్లాడుతూ కమిషనర్‌ అందించిన సహకారం, ప్రోత్సాహం మరువలేనిదన్నారు. అనంతరం గిరిబాబును ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమిషనర్లు అతీరా ఎస్‌.కుమార్‌, రాయలు, ఎం.నాగరాజు ఉద్యోగ సంఘాల నాయకులు యుగంధర్‌, నవీన్‌ రాజు, టి.వివేకానంద, గద్దె తిలక్‌, రాజేశ్వరరావు, సీతారామయ్యచౌదరి, పి.ఎస్‌ వి.ప్రసాద్‌, భాగ్యరావు, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న 300 ఏఎస్‌ఓ పోస్టులు భర్తీ చేయాలి

ఏపీ ఎకనామిక్స్‌ అండ్‌ స్టాటిస్టికల్‌ సబార్డినేట్స్‌ అసోసియేషన్‌



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రజనీష్‌బాబు

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): రాష్ట్రవ్యాప్తంగా అర్థగణాంక శాఖలో ఖాళీగా ఉన్న 300 అసిస్టెంట్‌ స్టాటిస్టికల్‌ ఆఫీసర్‌ పోస్టులు భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్‌ ఎకనామిక్స్‌ అండ్‌ స్టాటిస్టికల్‌ సబార్డినేట్స్‌ అసోసియేషన్‌(అపెస్సా) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్‌.రజనీష్‌బాబు డిమాండ్‌ చేశారు. మంగళవారం అపెస్సా సర్వసభ్య సమావేశం అర్థ గణాంక శాఖ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 రూరల్‌ మండలాలు, 9 అర్బన్‌ మండలాలు మొత్తం 18 మండలాల్లో అసిస్టెంట్‌ స్టాటిస్టికల్‌ ఆఫీసర్‌ పోస్టులను మంజూరు చేయాలన్నారు. రెవిన్యూ డివిజన్‌ నందు ఉపగణాంక అధికారి పోస్టును, గణాంక అధికారి పోస్టును మంజూరు చేయాలన్నారు. ఏఎస్‌ఓ పేరు మండల ప్రణాళిక, గణాంకాధికారిగా మార్చాలని డిమాండ్‌ చేశారు. గణాంకాధికారికి గెజిటెడ్‌ హోదా కల్పించాలన్నారు. ప్రతినెలా ఉద్యోగులకు జీతాలు చెల్లించాలన్నారు. ఈ సమస్యలను డైరెక్టర్‌ గోపాల్‌ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. సమావేశంలో అపెస్సా ప్రతినిధులు కె.చెంచురెడ్డి, ఏపీఎస్‌ నాయుడు, బీవీ మాధవి, సీహెచ్‌ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి అన్విత వైద్యానికి రూ.50 వేల సాయం



అన్విత తల్లిదండ్రులు శిరీష, స్పందన్‌ కుమార్‌కు చెక్కు అందజేస్తున్న కృష్ణ కేశవ

భవానీపురం(విజయవాడపశ్చిమ): అరుదైన గుండె జబ్బుతో బాధపడుతున్న చిన్నారి అన్విత వైద్య ఖర్చుల నిమిత్తం తల్లిదండ్రులు బోయల శిరీష, స్పందన్‌ కుమార్‌కు వన్‌టౌన్‌ కోమల విలాస్‌ సెంటర్‌కు చెందిన పొట్నూరి కృష్ణ కేశవ రూ.50 వేలను మంగళవారం అందజేశారు. ఇటీవల మృతిచెందిన తన సోదరుడు పొట్నూరి అజయ్‌ కుమార్‌ పేరుపై ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో వారికి ఇచ్చారు. పశ్చిమ నియోజకవర్గం కేఎల్‌ రావు నగర్‌ ఆరోలైన్‌లో నివసిస్తున్న స్పందన్‌ కుమార్‌, శిరీష దంపతుల పెద్ద కుమార్తె అన్విత (7) రెండేళ్ల నుంచి గుండె జబ్బుతో బాధపడుతోంది. ఆ బాలికకు గుండె మార్పిడి చికిత్స ఒక్కటే మార్గమని, అందుకు సుమారు రూ.55 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తేల్చి చెప్పారు. తమ బిడ్డకు అంత ఖరీదైన వైద్యం చేయించే ఆర్థిక స్తోమతు లేక ప్రభుత్వం, దాతల సాయం కోసం పేద కుటుంబానికి చెందిన ఆ దంపతులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే స్పందన్‌ కుమార్‌ రోడ్డు ప్రమాదంలో గాయపడి పాక్షికంగా పక్షవాతానికి గురికావడంతో కుటుంబ పోషణ మరింత భారమైంది. అన్విత కుటుంబం గురించి తెలుసుకున్న పొట్నూరి కృష్ణ కేశవ ఇటీవల నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. తాజాగా రూ.50 వేల సాయం అందించారు. చిన్నారి అన్విత వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు బాలిక తండ్రి స్పందన్‌ కుమార్‌కు 84648 56123 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాలింతలు, గర్భిణులకు కిట్లు పంపిణీ



బాలింతలకు ఆరోగ్య కిట్లను అందజేస్తున్న రోటరీ క్లబ్‌ నిర్వాహకులు

విందిపేట(విజయవాడపశ్చిమ): మెటర్నిటీ అండ్‌ చైల్డ్‌ హెల్త్‌ మాసోత్సవాలను పురస్కరించుకుని రోటరీ క్లబ్‌ ఆఫ్‌ విజయవాడ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేటలోని షేక్‌ రాజాసాహెబ్‌ జనరల్‌ ఆస్పత్రిలో బాలింతలు, గర్భిణులకు దోమతెరలు, పాల సీసాలు, బేబీ మ్యాట్స్‌తో కూడిన ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ క్లబ్‌ ఆఫ్‌ విజయవాడ అధ్యక్షుడు బాల గోపాలు మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే మెటర్నిటీ అండ్‌ చైల్డ్‌ హెల్త్‌ మాసోత్సవాలను పురస్కరించుకుని బాలింతలు, గర్భిణులకు కిట్‌లను పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ సారమ్మ, వైద్యులు, లయన్స్‌ క్లబ్‌ సభ్యులు మల్పూరి రామ్‌గోపాల్‌, భానుప్రకాష్‌, ప్రసాద్‌, సీహెచ్‌ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

• అడుగడుగునా ఆక్రమణలు



వాహనాల రాకపోకలకు అడ్డగా భవన నిర్మాణసామగ్రి, బడ్డీకొట్లు

రైల్వేస్టేషన్‌ సమీపంలోని కరుణ హోటల్‌ సెంటర్‌లో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. కొందరు రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రిని రోజులతరబడి నిల్వచేస్తున్నారు. వ్యాపారులు ఫుట్‌పాత్‌లను కూడా ఆక్రమించారు. కొందరు చోటామోటా నాయకులు రైల్వేస్టేషన్‌ పరిసర ప్రాంతాలను ఆక్రమించుకుని చిరువ్యాపారులకు అద్దెకు ఇస్తూ వేల రూపాయలు దండుకుంటున్నారు. రోడ్లను ఆక్రమిస్తూ బడ్డీ కొట్లు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్‌ పోలీసులు స్పందించి ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ)

'సూత్రా' ఫ్యాషన్‌ ఎగ్జిబిషన్‌ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని ఏ-కన్వెన్షన్‌ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సూత్రా – ది ఇండియన్‌ ఫ్యాషన్‌ ఎగ్జిబిషన్‌ (లగ్జరీ రాఖీ అండ్‌ వరలక్ష్మి ఫెస్టివ్‌ ఎడిట్‌) మంగళవారం ప్రారంభమైంది. రాఖీ, వరలక్ష్మి వ్రతం, వెడ్డింగ్‌కు సరిపడా డిజైనర్‌ ఫ్యాషన్‌, ఎత్నిక్‌ వేర్‌, ఫైన్‌ జ్యూయలరీ, గిఫ్టులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. స్టైలో మోడ్‌ – సాంస్కృతిక శోభతో కూడిన ఫ్యాషన్‌ సిల్హౌట్స్‌, యూబీ ట్రెడ్స్‌ – మాడర్న్‌ మ్యూజ్‌ కోసం ఫ్యూజన్‌ ఎత్నిక్‌ వేర్‌, ఇంపీరియల్‌ తార – లగ్జరీ ఫెస్టివ్‌ అండ్‌ బ్రైడల్‌ కొటూర్‌, మైసూర్‌ శారీలు – హెరిటేజ్‌ వీవ్స్‌ అండ్‌ హ్యాండ్లూమ్‌ క్లాసిక్స్‌, హౌస్‌ ఆఫ్‌ వీవర్స్‌ – నైపుణ్యంతో కూడిన ఆర్టిసానల్‌ గార్మెంట్స్‌ లభిస్తాయని పేర్కొన్నారు. ఉదయం పది నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్‌ ఉంటుందని తెలిపారు.